గునుగు పూలు తెచ్చి.. బతుకమ్మలు పేర్చి..



సద్దుల బతుకమ్మ వేడుకలకు మహిళలు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గురువారం నిర్వహించే ఈ వేడుకలకు బతుకమ్మలను తయారు చేసేందుకు తీరొక్క పూలు కొనుగోలు చేశారు. సిద్దిపేట పట్టణంలోని మెదక్ రోడ్డులో రైతు బజార్ వద్ద వివిధ రకాల పూలు విక్రయించారు. -న్యూస్‌టుడే, సిద్దిపేట

తెలంగాణ సంస్కృతిని చాటే పండగ: మంత్రి పొన్నం

హుస్నాబాద్, న్యూస్‌టుడే: పూలతో పూజించే సద్దుల బతుకమ్మ వేడుకల సందర్భంగా మహిళలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను దేశవిదేశాలకు చాటి చెప్పే బతుకమ్మ పండగను అంగరంగ వైభవంగా జరుపుకోవాలని కోరారు. నిండుకుండలా ఉన్న చెరువుల వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేసే సమయంలో మహిళలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పూలను పూజించే గొప్ప వేడుక: మాజీ మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట టౌన్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ పండుగను జిల్లా ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పూలతో పూజించే, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అన్నారు. మహిళలను గౌరవిస్తూ వారి ఔన్నత్యాన్ని చాటి చెప్పే వేడుక అన్నారు.




హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభలో హుస్నాబాద్‌కు చెందిన కోయడ రాజశేఖర్‌కు డీఎస్సీ నియామక పత్రం అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో సీఎస్ శాంతకుమారి, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ నేత అభిషేక్ మను సింఘ్వీ, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ

గురిపెట్టి గురుతర బాధ్యత చేపట్టి

కృషి, పట్టుదలఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించారు. ప్రతి ఒక్కరికీ ఒక కల ఉంటుంది. పట్టు విడవకుండా అవరోధాలను అధిగమిస్తూ.. దేనికీ వెరవకుండా ముందుకు సాగితేనే గమ్యం దరి చేరుతుందని చాటి చెప్పారు నిరుద్యోగ యువకులు. సమాజంలో అత్యంత గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిని చేజిక్కించుకున్నారు.

మిరుదొడ్డి, వర్గల్, గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే:



అయినవాళ్లు దూరమైనా..



అక్క, మౌనిక రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. టెట్ పరీక్షకు 20 రోజుల, డీఎస్సీ పరీక్షకు 45 రోజుల ముందు మా నాన్న యాదాగౌడ్ కూడా మృతి చెందారు. పంట విక్రయించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి వెళ్లి అక్కడే ధాన్యం కుప్పపై ప్రాణాలు విడిచారు. ఇంట్లో ఇద్దరిని కోల్పోయినా.. మొక్కవోని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాను. చిన్నప్పటి నుంచి తండ్రిపడిన కష్టం. తల్లిపై పడిన కుటుంబ భారాన్ని ప్రత్యక్షంగా చూశాను. కష్టపడి చదివి ఎస్జీటీలో జిల్లా స్థాయిలో 52 ర్యాంకు సాధించాను. - నరేందర్ ప్రశాంత్, మిరుదొడ్డి

రెండో ప్రయత్నంలో మూడో ర్యాంకు

మొదటి ప్రయత్నంలో 0.2 మార్కుల తేడాతో ఉద్యోగం చేజారింది. దీంతో పట్టుదలతో సన్నద్ధమయ్యాను. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తాత్కాలిక పద్ధతిలో విధులు నిర్వర్తిస్తూనే డీఎస్సీకి సిద్ధమయ్యాను. ఎలాంటి శిక్షణ లేకుండా సొంతంగా చదివి.. రెండో ప్రయత్నంలో జిల్లా స్థాయిలో ఎస్ఏలో 3వ ర్యాంకు సాధించాను. - దశరథం, మిరుదొడ్డి

వయసు తేడాతో ఉద్యోగం దూరం



డీఎస్సీ-2018లో రెండు నెలల వయసు తేడాతో ఉద్యోగానికి దూరం కావడం నా జీవితాన్ని కీలక మలుపు తిప్పింది. ర్యాంకు, సామాజిక వర్గం అన్నీ సరిపోయినా ఎక్కువ వయసున్న మహిళకు ఉద్యోగం వరించింది. వచ్చేసారి ఎలాగైనా ఉద్యోగం సాధించాలని అప్పుడే నిర్ణయించుకున్నా. అమ్మ లక్ష్మి, నాన్న నర్సింలు వ్యవసాయంతో పాటు ఖాళీ సమయంలో కూలీ పనులు చేస్తూ చదివించారు. వారికి చేదోడుగా నిలవాలని పట్టుదలతో చదివి పోటీ పరీక్షలకు సిద్ధమై.. ఎస్జీటీకి ఎంపికయ్యాను. - దాచారం రేణుక, పిడిచేడు, గజ్వేల్ మండలం

ఐదోసారి చేజిక్కి..



నాలుగు సార్లు డీఎస్సీ పరీక్షలు రాశాను. కేవలం 0.3 మార్కుల తేడాతో ఉద్యోగం సాధించలేకపోయాను. ప్రైవేటు పాఠశాలలో బోధిస్తూనే పరీక్షకు సన్నద్ధమయ్యాను. ఐదోసారి బీపెడ్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించాను. జిల్లాలో 4 ర్యాంకు వచ్చింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడు లేని గ్రామమైన ధర్మారంలో మొదటి వ్యక్తిగా నిలిచాను. 44 ఏళ్ల వయసులో ఉద్యోగం చేజిక్కింది. -రమేశ్, ధర్మారం, మిరుదొడ్డి మండలం

రెండు పోస్టులు సాధించి

పేదింట్లో పుట్టి పెరిగి అనేక కష్టాలు చూశాను. 2017 డీఎస్సీలో ఒక మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయాను. అయినా పట్టు వీడకుండా అప్పటినుంచి చదువుతూ ప్రస్తుతం ఎస్ఏతో పాటు స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో రెండు పోస్టులకు ఎంపికయ్యాను. నాకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. -దేవిరాము, వర్గల్

గాంధీ ట్రస్టు భూమి అన్యాక్రాంతంపై వ్యాజ్యం

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

ఈనాడు, హైదరాబాద్: సిద్దిపేట జిల్లా పొన్నాల గ్రామంలోని కోఠి గాంధీ స్మారక నిధికి చెందిన భూమి అన్యాక్రాంతమైందంటూ హైకోర్టులో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. హైదరాబాద్, సుల్తాన్‌బజార్, కోఠిలోని శ్రీమహాత్మా గాంధీ స్మారక నిధికి చెందిన భూమికి చట్టవ్యతిరేకంగా జరిగిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ పొన్నాలకు చెందిన తుపాకుల బాలరంగం సహా ఐదుగురు పిల్ దాఖలు చేశారు. పొన్నాల సర్వేనంబరు 241/ఎ/బి2/1లో 3 ఎకరాలు, సర్వే 241/ఎ/బి2/2లో 2.34 ఎకరాలను 2022 ఆగస్టు 6న జరిగిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరారు. ట్రస్టుకు ఒక దాత ఇచ్చిన భూములను రెవెన్యూ రికార్డుల్లో ప్రైవేట్ వ్యక్తుల పేరిట మార్చినట్లు పిల్‌లో పేర్కొన్నారు. వారిపరం చేసిన జాయింట్ సబ్‌రిజిస్ట్రార్(తహసీల్దార్) చర్యలను రద్దు చేయాలని కోరారు. శ్రీనివాసు కొండాయి అనే వ్యక్తికి భూమితో సంబంధం లేని అరిగె శ్రీహరి(రిటైర్డు తహసీల్దార్), అరిగె విజయ్ కుమార్ రిజిస్టర్ చేయడం చెల్లదన్నారు. రిజిస్టర్డ్ సేల్ డీడ్‌లను ఆమోదించిన తహసీల్దార్ నిర్ణయాలు పాత, కొత్త ఆర్‌వోఆర్ చట్ట నిబంధనలకు వ్యతిరేకమన్నారు. భూదాత అభీష్టానికి అనుగుణంగా ట్రస్ట్ కార్యకలాపాలను నిర్వహించాలని.. అన్యాక్రాంత చర్యలను నిలుపుదల చేసి ట్రస్ట్ భూమిని కాపాడాలని కోరారు. దీనిపై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్ జె. శ్రీనివాసరావులతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఇటీవలే విచారణ చేపట్టింది. విచారణ తరువాత ధర్మాసనం, ప్రతివాదులైన సాధారణ పరిపాలన, రెవెన్యూశాఖల ముఖ్య కార్యదర్శులు, భూపరిపాలన ప్రధాన కమిషనర్, సిద్దిపేట జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, ఇతరులకు నోటీసులు జారీ చేసింది. ఆరువారాల్లోగా తమ వాదనలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది.



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



అమ్మవారి ఉత్సవ విగ్రహంతో గిరి ప్రదక్షిణ చేస్తూ..

వీణాధారి.. విద్యా ప్రదాయిని

వర్గల్, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వర్గల్ విద్యాధరి సరస్వతీ అమ్మవారి ఆలయంలో దేవీశరన్నవరాత్రులు అత్యంత వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. బుధవారం సరస్వతీ అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలానక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి పర్యవేక్షణలో అర్చకస్వాములు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారు సరస్వతీదేవిగా నిజరూపదర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ నేతృత్వంలో భక్తులు అమ్మవారి ఉత్సవ విగ్రహంతో గిరిప్రదక్షిణ చేశారు. లక్ష పుష్పార్చన, లక్ష పుస్తక పూజ నిర్వహించారు. వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయించారు.



గర్భగుడిలో బారులు తీరి..



సిద్దిపేట టౌన్: పట్టణంలోని కాళ్లకుంట కాలనీలోని అష్టలక్ష్మీ సహిత లలితా పరమేశ్వరీ ఆలయంలో మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారిని సరస్వతీ రూపంలో అలంకరించారు.



చేర్యాల: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో బుధవారం దుర్గామాత త్రిరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం అమ్మవారి సన్నిధిలో మహాకాళి, మహాలక్ష్మీ, మహాసరస్వతీ, స్వరూప చండీ కలశ స్థాపన నిర్వహించారు.

ప్రతిపక్షాలను అణచివేయడం తగదు: ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి



హైదరాబాద్‌లోని తన నివాసం వద్ద పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త

దుబ్బాక, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అణచివేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. 317 జీవో ద్వారా నష్టపోయిన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ, వారికి భారాస సంఘీభావం ప్రకటించింది. ఈ నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందజేసే కార్యక్రమాన్ని భారాస ఎమ్మెల్యేలు అడ్డుకుంటారనే ముందస్తు సమాచారంతో నియోజకవర్గ పర్యటనకు బయలుదేరిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్ కొండాపూర్‌లోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా తనను అడ్డుకున్న పోలీసులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై మాదాపూర్ అదనపు డీసీపీ జయరాంతో మాట్లాడి, మాదాపూర్‌లోని తన కార్యాలయానికి వెళ్లేందుకు అనుమతివ్వాలని కోరారు. కార్యాలయానికి వెళ్లిన అనంతరం బయటకు రాకుండా ఆయనను అక్కడే హౌస్ అరెస్ట్ చేశారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు, అడ్డంకులు సృష్టించినా, భారాస ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామన్నారు.

పెండింగ్ పనులపై ప్రభుత్వం స్పందించాలి

గజ్వేల్ న్యూస్‌టుడే: గజ్వేల్ నియోజకవర్గంలో ఉన్న పెండింగ్ పనులపై ప్రభుత్వం స్పందించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా భారాస ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెప్పు పొందేందుకు గజ్వేల్‌లో కాంగ్రెస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. నిరుపేదలకు గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేసిందని, వాటిని ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తొక్కి పెడుతోందన్నారు.

చిరుత కనిపిస్తే చెప్పండి



వడ్డేపల్లి అటవీ ప్రాంతంలో పరిశీలిస్తున్న దుబ్బాక రేంజ్ ఆఫీసర్ సందీప్ కుమార్

రాయపోల్, న్యూస్‌టుడే: చిరుత జాడ కనిపిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని దుబ్బాక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సందీప్ కుమార్ అన్నారు. బుధవారం రాయపోల్ మండలం వడ్డేపల్లిలో రైతులకు పలు సూచనలు చేశారు. పొలాల చుట్టూ విద్యుత్తు కంచె ఏర్పాటు చేసుకోవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. సెక్షన్ ఆఫీసర్ హైమద్‌హుస్సేన్, బీట్ ఆఫీసర్ జహంగీర్, వేణు ఉన్నారు.

నైపుణ్య శిక్షణతో చక్కటి ఉపాధి



స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట టౌన్, అర్బన్, న్యూస్‌టుడే: వృత్తి నైపుణ్య శిక్షణ ద్వారా చక్కటి ఉపాధి పొందవచ్చని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సిద్దిపేటలోని కేసీఆర్‌నగర్‌లో ఎల్‌అండ్‌టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. కేంద్ర ప్రిన్సిపల్ అల్గర్ స్వామికి పలు సూచనలు చేశారు. అనంతరం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో నిర్మించిన జిల్లా సమాఖ్య భవనాన్ని పరిశీలించారు. డీఆర్డీవో జయదేవ్‌ఆర్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్ తదితర వాటిల్లో శిక్షణ ఇప్పించాలని సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న వృద్ధాశ్రమ భవనాన్ని, ఎన్సాన్‌పల్లిలో జిల్లా జైలును పరిశీలించారు. అన్ని సౌకర్యాలు ఉండేలా నిర్మాణాన్ని చేపట్టాలని జైలు సూపరింటెండెంట్ దశరథానికి సూచించారు. ఆయన వెంట సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ సలీమ్ ఉన్నారు.

మహిళల హింసపై ఉద్యమిద్దాం: విమలక్క



అక్కారం గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న విమలక్క

గజ్వేల్ న్యూస్‌టుడే: సమాజంలో మహిళలపై జరుగుతున్న హింసపై ఉద్యమిద్దామని అరుణోదయ సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క అన్నారు. బుధవారం గజ్వేల్ మండలం అక్కారంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బహుజన బతుకమ్మ కార్యక్రమంలో ఆమె పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. చెరువులు వాగులను కాపాడుకోవాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం: సీపీ

సిద్దిపేట టౌన్: పండగల నేపథ్యంలో సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ అనూరాధ సూచించారు. ఆఫర్లు ఉన్నాయనే మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. సైబర్‌నేరగాళ్ల బారినపడితే వెంటనే 1930కు సమాచారం అందించాలన్నారు. 24 గంటల్లో పోలీసులను ఆశ్రయిస్తే నగదు రికవరీ చేయొచ్చన్నారు.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

ములుగు, న్యూస్‌టుడే: రైతులకు నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన క్రిమిసంహారక మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని రాధిక అన్నారు. బుధవారం ములుగు మండలం ములుగు, వంటిమామిడి, కొత్తూరు గ్రామాల్లో ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల వ్యవసాయ అధికారిని ప్రగతి పాల్గొన్నారు.

పత్తికి ధర లేక దిగాలు

సీసీఐ కేంద్రాలకు ఇంకా నోటిఫైకాని మిల్లులు



మిల్లులో పత్తి

పత్తి సాగు:	1.08 లక్షల ఎకరాలు
దిగుబడి అంచనా:	15 లక్షల క్వింటాళ్లు

2023 కొనుగోళ్లు ఇలా....

గ్రేడు	మద్దతుధర (క్వింటాకు)
పొడవు రకం	7521
మధ్య రకం	7121

కేంద్రం	రైతులు	కొనుగోలు (క్వింటాళ్లలో)
సీసీఐ	47,366	7,45,880
ట్రేడర్స్	44,335	2,45,708

న్యూస్‌టుడే, గజ్వేల్: ఎన్నో ఆశలు పెట్టుకున్న పత్తికి ఆరంభంలోనే మద్దతు కరువవుతోంది. జిల్లాలో సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు ఇంకా పత్తి మిల్లులను నోటిఫై చేయకపోవటం రైతులకు శరాఘాతంగా మారింది. చేతికొచ్చిన పత్తిని పండుగ ఖర్చుల కోసం విక్రయిస్తుండగా అదును చూస్తున్న ప్రైవేటు వ్యాపారులు రూ.6500 క్వింటాలు చొప్పున కొనుగోలు చేస్తుండటం అన్నదాతలను ఆవేదనకు గురి చేస్తుంది. ఈసారి ప్రభుత్వ పత్తికి క్వింటాలుకు రూ.7121 మద్దతు ధర ప్రకటించిన విషయం తెల్సిందే. మద్దతు మించి ధర పలుకుతుందని ఆశించిన రైతులు ధర లేక ఉసూరుమంటున్నారు.

తక్కువకు కొని..

సీసీఐ కొనుగోలు చేసిన పత్తిని జిన్నింగ్ చేసేందుకు ప్రభుత్వం టెండర్లు పిలువగా గత నెల 25వ తేదీలోపు జిల్లాలోని ట్రేడర్లు టెండర్లలో పాల్గొన్నారు. ఇప్పటికీ వాటికి సంబంధించిన వివరాలు ఇంకా ప్రకటించలేదు. ఫలితంగా మిల్లులు నోటిఫై ప్రక్రియకు జాప్యం నెలకొంటుంది. అంతర్జాతీయ విపణిలో ధరలు లేవని ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

విపణికి రావడంతో..

స్థానికంగా జిన్నింగ్ మిల్లులు లేని సమయంలో ఇక్కడ కొనుగోలు చేసిన పత్తిని వ్యాపారులు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర తదితర చోట్లకు తరలించి జిన్నింగ్ చేయించేవారు. ఈ క్రమంలో రవాణా ఛార్జీల మోతతో వ్యాపారులు రైతుల వద్ద పత్తిని తక్కువ ధరకే కొనుగోలు చేసేవారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 26 జిన్నింగ్ మిల్లులు అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడ పండిన పత్తిని కొనుగోలు చేసి ఇక్కడే జిన్నింగ్ చేస్తుండటంతో రైతులకు లాభసాటిగా మారి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పుడిప్పుడే పత్తి విపణికి రావటం మొదలైంది. మరో వారం రోజుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే ధర నిలకడగా ఉంటుందని లేకుంటే ప్రైవేటు వ్యాపారుల మాయాజాలానికి రైతులు తీవ్రంగా నష్టపోతారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మిల్లులు నోటిఫై కాలేదు:నాగరాజు, డీపీఓ

జిల్లాలో సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు ఇంకా జిన్నింగ్ మిల్లులు నోటిఫై కాలేదు. ఈ ప్రక్రియ కోసం కృషి చేస్తున్నాం. త్వరతిగతిన సీసీఐ కేంద్రాల ఏర్పాటుచేసి రైతులకు దన్నుగా నిలిచేలా అన్ని విధాల చర్యలు చేపడుతాం.

పంట రుణాలకు ఎదురుచూపులు

32.61శాతానికి మించని లక్ష్యం

జిల్లాలో పంట రుణాల వివరాలు (రూ. కోట్లలో)
లక్ష్యం: రూ.3474.40
పంపిణీ చేసింది: 1133.72
శాతం: 32.61

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: పంటలు చేతికొస్తున్న రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడంలో జాప్యం జరుగుతోంది. జిల్లాలో పంటల రుణ పంపిణీ లక్ష్యం సెప్టెంబరు 30వ తేదీ వరకు 50 శాతం పూర్తి కావాల్సి ఉన్నా.. ఇప్పటి వరకు కేవలం 32.61శాతం మాత్రమే పంపిణీ చేసింది. ప్రతి మూడు మాసాలకు ఒకసారి ఆయా బ్యాంకు అధికారులతో సమీక్షించి లక్ష్యం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నారు.

రుణమాఫీ ప్రక్రియతో ఆలస్యం

రుణమాఫీ అర్హత ఉండి పొందని రైతుల వివరాల నమోదు ప్రక్రియను ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఆధార్, రేషన్ కార్డు, ఇంటి పేరులో దొర్లిన తప్పులు, తదితర వివరాలను బ్యాంకు అధికారులు సేకరిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో రుణమాఫీ కారణంగా పంట రుణాల పంపిణీలో కాస్త ఆలస్యమైందని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. రుణం తీసుకొని భూమి తన వారసుల పేరిట మార్పిడి చేసినా.. విక్రయించిన రైతుల పేర్లు జాబితాలో నమోదు కాలేదు. రుణమాఫీకి సంబంధించి బ్యాంకుల్లో తప్పులు దొర్లిన వారి వివరాలు సరి చేస్తున్నామని పేర్కొంటున్నారు.

కొనసాగుతున్న నిర్ధరణ

రుణమాఫీ కానీ రైతుల దరఖాస్తుల ప్రకారం 16,086 కుటుంబాలను అధికారులు గుర్తించారు. ఇందులో 12,187మంది వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు గ్రామగ్రామాన తిరుగుతూ ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మిగతా 3,899మంది వివరాలను నమోదు చేయాల్సి ఉంది. రుణమాఫీ ప్రత్యేక పోర్టల్‌లో రేషన్ కార్డు లేనివారి వివరాలను అధికారులు నమోదు చేశారు. 2018 తర్వాత తీసుకున్న పంట రుణాలు రెన్యువల్ చేసుకున్న, 2018

విడతల వారీగా రుణమాఫీ (రూ.కోట్లలో)

	మొత్తం	రైతులు
మొదటి	290.12	53129
రెండో	277.20	27875
మూడో	271.21	21071



రైతుల వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

డిసెంబరు 12కు ముందు తీసుకున్న రుణాల కారణంగా మాఫీవర్తింప చేయడంలేదని అధికారులు చెబుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

లక్ష్యం అధిగమిస్తాం...

రైతులకు పంట రుణాల పంపిణీలో ఇబ్బందులు ఉంటే వెంటనే పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ఆధార్, బ్యాంకు ఖాతాల్లో, పట్టాపాసు పుస్తకాల్లో ఏవైనా తప్పులు దొర్లితే వాటిని సవరిస్తాం. అర్హులైన ప్రతి రైతుకు రుణం అందించేలా చర్యలు తీసుకుంటాం. అక్టోబరు నెలలో నిర్దేశించిన పంట రుణాల పంపిణీ పూర్తి చేస్తాం.

హరిబాబు, లీడ్ బ్యాంకు మేనేజర్

పీఆర్‌టీయూ కార్యవర్గంలో పలువురికి చోటు

జగదేవపూర్: పీఆర్‌టీయూ రాష్ట్రకౌన్సిల్ సమావేశాల్లో మండలానికి చెందిన ఏడుగురికి చోటు లభించిందని మండలాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్, రఘు రాములు, ఉపాధ్యక్షులుగా నరసింహారెడ్డి, సంధ్యాకుమారి ఎంపికైనట్లు తెలిపారు.

2వేల ఏళ్లనాటి టెర్రకోట గిరక లభ్యం



నంగునూరు, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా నంగునూరులో 2వేల ఏళ్ల నాటి టెర్రకోట మట్టి గిరక లభ్యమైనట్లు కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధన సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నంగునూరు పాటిగడ్డ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో 5 అంగుళాల ఎత్తు, 3 అంగుళాల వెడల్పుతో కలిగిన అద్భుతమైన పనితనం కలిగిన మట్టి గిరక లభ్యమైంది. దీన్ని నీళ్లు తోడడానికి గానీ.. మగ్గం నేయడానికి ఉపయోగించినట్లు తెలుస్తోంది. ఈ గిరకకు ఉన్న గాడి లోతు, అంచుల వంపును బట్టి దీని మీద మందపు తాళ్లు వాడినట్లు గుర్తులు కనిపిస్తున్నాయని తెలిపారు.

గడువులోగా స్టేషన్ పునరాభివృద్ధి పనులు

డీఆర్‌ఎం భరతేశ్‌కుమార్ జైన్




పునరాభివృద్ధి పనులు పరిశీలిస్తున్న డీఆర్‌ఎం భరతేశ్‌కుమార్ జైన్

జహీరాబాద్ అర్బన్: అమృత్ భారత్ స్టేషన్ పునరాభివృద్ధి పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని దక్షిణమధ్య రైల్వే డీఆర్‌ఎం భరతేశ్‌కుమార్ జైన్ అధికారులకు సూచించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ రైల్వేస్టేషన్‌ను బుధవారం తనిఖీ చేసి చేపడుతున్న పనులను పరిశీలించారు. స్టేషన్ ముఖద్వారం, వెయిటింగ్ హాల్, సీవోపీలు, ఎస్కలేటర్ సహా పార్కింగ్ ప్రాంతాల్లో నిర్మాణాలను సందర్శించి పనుల నెమ్మదిగా జరుగుతున్న తీరుపై అసంపూర్తి వ్యక్తం చేశారు. స్టేషన్ ప్రధాన ముఖద్వారం ఎర్రరాయి కట్టడంతో ఉన్నందున కొత్త నిర్మాణ అనుసంధానంలో ఇబ్బందులపై అధికారులు వివరించారు. అవసరమైతే పూర్తిగా తొలగించి త్వరగతిన నిర్మాణం పూర్తిచేయాలని సూచించారు. స్టేషన్ మేనేజర్ మాధవకృష్ణ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. బీదర్-తిరుపతి రైలును జహీరాబాద్‌లో నిలిపేలా చూడాలని స్థానిక భాజపా నేతలు వినతిపత్రం అందజేశారు.

మనసు.. మాట వింటోందా!

కౌన్సెలింగ్, థెరపీలతో పరిష్కారం



'మీరు మానసికంగా ఎంత స్థిరంగా ఉన్నా. మీ మాటలు, చర్యల వల్ల కుటుంబ సభ్యులు, ఇతరులు ఎంతలా బాధపడుతున్నారో?' ఎప్పుడైనా ఆలోచించారా.. మనసు స్థితి తేడాగా ఉందని తెలుస్తున్నా పరిష్కార మార్గానికి వైద్యులను ఆశ్రయించేందుకు వెనుకాడుతున్నారా.. అనేక అపోహలు.. మూఢ నమ్మకం.. తీవ్రమైన ఒత్తిడి, తెలియని ఆందోళన.. తరచూ తప్పుడు ఆలోచనలు.. వీటి నుంచి బయట పడితేనే జీవితం చక్కగా సాగుతుంది. చాలామంది వివిధ కారణాలతో మానసిక పరమైన జబ్బులతో వేదనకు గురవుతున్నారు. బాధితులతో పాటు కుటుంబ సభ్యులు తల్లడిల్లుతున్నారు. అందుబాటులో ఉన్న వైద్య సేవలను వినియోగించుకోవాలని నిపుణులు చెబుతున్నారు. నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

న్యూస్‌టుడే, సిద్దిపేట:

మానసిక ఆరోగ్యంపై అవగాహన లేక కొందరు కుంగిపోతున్నారు. సమస్య ఉన్నా.. ఏమి లేదనే భావనతో కాలం వెళ్లదీస్తున్నారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో అత్యధిక శాతం ఆరోగ్యంగా ఉన్నా.. అనారోగ్య సమస్యలు ఉన్నాయనే భావన (హైపో కాండ్రియాసిస్)తో ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వివిధ రకాల పరీక్షలు చేస్తున్నా.. పరిష్కారం లభించక మదన పడుతున్నారు. ఎక్కువగా గుండె జబ్బు ఉందనే భావన వ్యక్తమవుతోంది. ఆయా పరిణామాలతో పలువురు ఇంటికే పరిమితవుతున్నారు. చివరికి మానసిక వైద్య నిపుణులను సంప్రదించడం ద్వారా అపోహలు తొలగిపోతున్నాయి. చిన్నపాటి విషయాలకే ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఉదంతాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. కుటుంబ కలహాలతో మనోవేదనకు గురై.. మానసిక అనిశ్చితి ఏర్పడుతోంది.



బాధితుడితో మాట్లాడుతున్న డాక్టర్ శాంతి



కీలకంగా సేవలు

సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల అనుబంధ సర్వజన ఆసుపత్రిలో మానసిక వైద్య విభాగం (సైక్యాట్రీ) సేవలు కీలకంగా మారాయి. నిత్యం సగటున 50 మంది ఓపీ సేవలను వినియోగించుకుంటున్నారు. ఇక్కడ మొత్తం 30 పడకలు అందుబాటులో ఉన్నాయి. 15 - 20 మంది ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. ప్రాథమిక దశలో మానసిక జబ్బులతో చేరిన వారికి కౌన్సెలింగ్ ద్వారా మార్పు తెస్తున్నారు. పలు రకాల థెరపీలను అందిస్తున్నారు. రోగిస్థాయి ఆధారంగా గరిష్ఠంగా ఆరు నెలల వరకు చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యం బాగైన తరువాత వారిని ఉదాహరణగా చూపుతూ.. మార్పు సాధ్యమంటూ రోగుల్లో ధైర్యాన్ని నూరిపోస్తున్నారు. మానసిక ఒత్తిడి, కుంగుబాటు, చేసిన పనే చేయడం, సైకోసిస్, తదితర విభాగాల్లో బాధితులకు బాసటగా నిలుస్తున్నారు. డీ-అడిక్షన్ కేంద్రం సేవలు కీలకంగా మారుతున్నాయి.

సకాలంలో సేవలు పొందాలి..

– ప్రొఫెసర్ డా. శాంతి, మానసిక వైద్య నిపుణురాలు (సిద్దిపేట సర్వజన ఆసుపత్రి)

సేవలు అందించే క్రమంలో సైక్యాట్రీ చరిత్ర మొత్తం తెలుసుకుంటాం. కుటుంబ, వ్యక్తిగత వివరాలు, మానసిక స్థితి తెలుసుకొని ఒక అంచనాకు వస్తుంటాం. మానసిక స్థితిని పరీక్షిస్తాం. ఆలోచనలు, ఏకాగ్రత, నిర్ణయాలు తీసుకునే విచక్షణ, మాట్లాడే విధానం.. ప్రతీది కచ్చితమైన అంచనాతో చికిత్సలు చేస్తుంటాం. అవసరమైన వైద్య పరీక్షలు ఉంటాయి. కౌన్సెలింగ్, చికిత్స, థెరపీల ద్వారా బాగు చేస్తున్నాం. కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ చేపడుతున్నాం. మానసిక సమస్యలతో బాధపడే వారు సకాలంలో ఆసుపత్రికి రావడం లేదు. మార్పు రావాలి. డబ్బును వృథా చేసుకోవద్దు. ప్రతీ సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందని గ్రహించి నిర్ణయం తీసుకోవాలి.

పరిణామాలు ఇలా..



- మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారు. మానేసే ప్రయత్నాలు విఫలమై తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు.
- స్వతహాగా కలవరపాటుకు గురవుతున్నారు. అనుమానాలు పెంచుకుంటున్నారు.
- అతి శుభ్రత (ఓసీడీ)తో ఇతరులను ఇబ్బందికి గురిచేస్తున్నారు.
- అభూత కల్పనతో గడిపేస్తున్నారు.
- మూఢ నమ్మకాలను విశ్వసిస్తున్నారు.
- లైంగిక, నిద్రలేమి లాంటి సమస్యల్లో చిక్కుకుంటున్నారు.
- విశ్రాంతి లేని జీవనం, తీవ్రమైన ఒత్తిడితో బాధపడుతున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో నాలుగు రజతాలు



అథ్లెట్లతో వెంకటస్వామిగౌడ్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: హనుమకొండలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిద్దిపేట జిల్లా అథ్లెట్లు సత్తా చాటారు. ఏకంగా నాలుగు రజత పతకాలు సాధించారు. డెకథ్లాన్, హైజంప్ అంశాల్లో రాఘవాపూర్‌కు చెందిన గ్యార లీలాఆనంద్ రెండు రజత, అండర్-18 విభాగంలో కొండపాకకు చెందిన నగేశ్ జావెలిన్‌త్రోలో రజత పతకం, ఇదే కేటగిరిలో షాట్‌పుట్‌లో అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు చెందిన వాసు రజత పతకం సాధించారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, వెంకటస్వామిగౌడ్ తెలిపారు. ఈ మేరకు జిల్లా యువజన క్రీడల ఇన్‌ఛార్జి అధికారి జయదేవ్ ఆర్య, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి సౌందర్య, ప్రతినిధులు, శిక్షకులు అభినందించారు.

'విశ్వబ్రాహ్మణుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు'

సిద్దిపేట: విశ్వబ్రాహ్మణుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని, కార్పొరేషన్ సాధనకు సమష్టిగా ఉద్యమించాలని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి అన్నారు. సిద్దిపేటలో సమావేశానికి హాజరైన ఆయన జిల్లా అధ్యక్షుడు సాయన్నగారి శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. కుటీర పరిశ్రమలకు ఉచితంగా విద్యుత్తు సరఫరా చేయాలని, 50 ఏళ్లు నిండిన వారికి పింఛను ఇవ్వాలని, రాయితీపై కలపను అందించాలని, అటవీ అధికారుల దాడులు నివారించాలన్నారు. సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు గోపాలచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్ తదితరులు ఉన్నారు.

జ్ఞానసమాజమే లక్ష్యం

27న 'స్వేరోస్' కన్వెన్షన్: ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: విద్యాభ్యాసాన్నే ఆయుధంగా మలుచుకుని జ్ఞాన సమాజమే లక్ష్యంగా స్వేరోస్ నెట్‌వర్క్ కొనసాగుతుందని సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. కులాలు, మతాలకు అతీతంగా తమ నెట్‌వర్క్ నడుస్తుందన్నారు. అణచివేత, సామాజిక రుగ్మతలు, గంజాయికి వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని చెప్పారు. ఈనెల 27న సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో స్వేరోస్ జాతీయ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సిద్దిపేటలో కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశానికి ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. బిజినెస్ అంశంపై సమాలోచనలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా స్వయం ఉపాధి వైపు యువత ఏ విధంగా నడవాలనే అంశంపై చర్చిస్తామన్నారు. రాష్ట్ర కన్వీనర్ దుర్గయ్య, కోకన్వీనర్ వీరన్న, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు ఉప్పలేటి బాబు, ప్రధాన కార్యదర్శి చిన్నికృష్ణ, ప్రతినిధులు పాల్గొన్నారు.

దర్శనంతో తాదాత్మ్యం.. ఆటాపాటతో ఆనందం



సిద్దిపేట: పార్వతీమాత ఆలయంలో నాణేలతో అభిషేకం



కుమార్తెలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది



సంగారెడ్డిలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అధికారిణులు, సిబ్బంది

న్యూస్‌టుడే, పాపన్నపేట, మెదక్, సంగారెడ్డి టౌన్, సిద్దిపేట టౌన్: 'శ్రీమహాకాళి మహాలక్ష్మి మహాసరస్వతి బాలత్రిపురసుందరి మాతాయై నమః' అని మండపాలు, అమ్మవారి ఆలయాల్లో మంత్రోచ్ఛారణలు మార్మోగుతున్నాయి. 'ఇద్దరక్కచెల్లెళ్ల ఉయ్యాలో.. ఒక్కూరికిచ్చి ఉయ్యాలో..' అని మహిళల ఆటాపాట సందడి పూల పరిమళాల మధ్య ఉత్సాహభరితం చేస్తోంది. మెదక్, సంగారెడ్డి కలెక్టరేట్లలో కలెక్టర్లు రాహుల్‌రాజ్, వల్లూరు క్రాంతి, వారి కుటుంబ సభ్యులు బతుకమ్మల చుట్టూ ఆడారు. కొన్నిచోట్ల 8వ రోజున సద్దుల బతుకమ్మ పండుగ చేసి స్థానిక నీటివనరుల్లో నిమజ్జనం చేశారు.



సరస్వతిమాత అలంకరణలో ఏడుపాయల వనదుర్గ


నదిలో పడి యువకుడి మృతి



రమేశ్

మనూరు, న్యూస్‌టుడే: ప్రమాదవశత్తు కాలు జారి నదిలో పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మనూరు మండలం రాయిపల్లి వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మున్నూర్ రమేశ్(26) కాళ్లు కడుక్కుందామని నది వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి నదిలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. రమేశ్ తండ్రి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

చెరువులో పడి రైతు..



యాదయ్య

టేక్మాల్, న్యూస్‌టుడే: స్నానం చేసేందుకు చెరువులోకి వెళ్లి ప్రమాదవశాత్తు ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలం కుసంగి గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాలు.. కుసంగి గ్రామానికి చెందిన ముస్లాపరం యాదయ్య(50) వ్యవసాయంతో పాటు మేకలను పెంచుతూ జీవిస్తున్నాడు. ఈ నెల 7న మేకలు మేపడానికి వెళ్లాడు. స్థానిక పెద్ద చెరువులో స్నానం చేద్దామని దిగాడు. ఈత రాకపోవడంతో చెరువులో మునిగి చనిపోయాడు. మేకలు ఇంటికి వచ్చినా యాదయ్య రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. ఆచూకీ దొరకలేదు. బుధవారం చెరువులో మృతదేహం తేలింది. తమ్ముడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. యాదయ్యకు భార్య బూదవ్వ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలకు వివాహాలు అయ్యాయి.

ఈత నేర్చేందుకు వెళ్లి మృత్యువాత


చిన్నకోడూరు, నంగునూరు: ఈత నేర్చడానికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందిన ఘటన చిన్నకోడూరు మండలంలోని ఓబులాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆసీఫ్ తెలిపిన వివరాలు.. జక్కుల ఎల్లయ్య(38) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య భారతవ్వ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం ఉదయం ఎల్లయ్య తన సోదరుడు కుమారుడికి ఈత నేర్పించడానికి చెరువు వద్దకు తీసుకెళ్లాడు. ఎల్లయ్య చెరువులోకి దిగి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. గమనించిన బాలుడు పరుగెత్తుకుంటూ వచ్చి గ్రామస్థులకు తెలిపాడు. వారు వెళ్లి ఎల్లయ్యను బయటకు తీసి చూడగా అప్పటికే మృతి చెందాడు. తల్లి ఎల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది.

రామలింగేశ్వరస్వామీ.. నీవైనా చెప్పవూ..


- 'ప్రసాద్' పథకానికి 'కూడవెల్లి' ఎంపికై రెండేళ్లు
- అడుగులు పడక.. పర్యాటకాభివృద్ధికి నోచుకోక..

న్యూస్‌టుడే, దుబ్బాక

మన దేశంలో పర్యాటక రంగం ఎక్కువగా ఆధ్యాత్మిక క్షేత్రాల చుట్టూ ఉంటోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ కోణాల్లో ఆదాయాన్ని తెచ్చి పెడుతోంది. కానీ ప్రధానంగా భక్తులకు, పర్యాటకులకు మౌలిక వసతులను ప్రభుత్వం సమకూర్చితే ఆదరణ అధికంగా ఉంటుంది. రెండేళ్ల క్రితం సిద్దిపేట జిల్లా కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం 'ప్రసాద్' (తీర్థయాత్రల పునరుజ్జీవనం, ఆధ్యాత్మిక వారసత్వ వృద్ధి) పథకానికి ఎంపిక చేసింది. అమలు చేయడంలో వెనుకబాటులో ఉంది.



శిథిలావస్థకు చేరిన గుళ్లు



రామలింగేశ్వర స్వామి

మిగిలినవి 9 ఎకరాలే

ఏడాది పొడవునా నిత్య పూజలను అర్చకులు నిర్వహిస్తున్నారు. వసతులు లేకపోవడంతో భక్తుల సంఖ్య రాకపోకలు తక్కువగా ఉంటోంది. గుడి భూములు అన్యాక్రాంతమయ్యాయి. ప్రస్తుతం కేవలం 9 ఎకరాలు మాత్రమే మిగిలాయి. ఇక్కడ 2004లో కల్యాణ మండపం నిర్మించినా పూర్తిస్థాయిలో వసతులు లేక వినియోగించటం లేదు. 2018లో దేవాదాయ శాఖ రూ.1.25 కోట్ల సర్వ శ్రేయోనిధి నుంచి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రాకార మండపం, రాజ గోపురం, ప్రహరీ కొంతమేర పూర్తయ్యాయి. 'ప్రసాద్ పథకానికి ఎంపికైనా నేటి వరకు ఆలయ పరిసరాల్లో పనులు చేపట్టలేదని.. రాష్ట్ర దేవాదాయ, పర్యాటక అభివృద్ధి శాఖల దృష్టికి తీసుకెళ్తామని.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటామని ఈవో విశ్వనాథశర్మ తెలిపారు.

పథకం అమలైతే సమకూరేవి

- కూడవెల్లి వద్ద రూ.కోటి నిధులతో ఒక ఎకరా స్థలంలో 20 రకాల మౌలిక వసతులు నిర్మిస్తారు.
- తీర్థయాత్ర సమాచార కేంద్రం, వెయిటింగ్ లాంజ్, శౌచాలయాలు, ప్రసాదం కౌంటర్లు, ప్రథమ చికిత్స కేంద్రం, సంచులు పెట్టే గదులు, క్యాంటీన్, దుకాణాలు, బహుళ ఉపయోగకరమైన హాల్.

2022 నుంచి ఏం చేశారు?

- ఆలయ ఈవో 2022 నవంబరులో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థకు, కేంద్ర పర్యాటక శాఖకు ప్రసాద్ పథకం అమలుకు కేటాయించే ఒక ఎకరా భూమి వివరాలు పంపించారు.
- పర్యాటక శాఖ అధికారులు ఆలయాన్ని సందర్శించారు.
- మౌలిక వసతులపై అంచనా వేసి, భూమి మట్టిని పరీక్షకు తీసుకెళ్లారు.

ఏమేం చేయాలి?

- కాశీ విశ్వనాథుడు, వేంకటేశ్వరుడు, బొబ్బిలి వీరన్న స్వామి గుళ్లు శిథిలమయ్యాయి. పునర్నిర్మించాలి.
- తాగునీరు సౌకర్యం కల్పించాలి.
- వాగులో పుణ్యస్నానాలు ఆచరించడానికి స్నాన ఘట్టాలు, దుస్తులు మార్చుకోవడానికి గదులు అవసరం.
- వాగులో వేసే పిండాలు, అస్థికలు, ఇతర కర్మకండ సామగ్రితో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఏర్పాట్లు చేయాలి.

గుడి విశేషాలు

- అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని రామేశ్వరంపల్లి పరిధిలో కూడవెల్లి వాగు ఒడ్డున గుడి నెలవైంది.
- శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం అని క్షేత్రపురాణంతో ప్రసిద్ధికెక్కింది. శతాబ్దాల చరిత్ర ఆలయానికి ఉంది.
- కాశీ నుంచి ఆంజనేయస్వామి తెచ్చిన శివలింగం.. శ్రీరాముడు ప్రతిష్ఠించింది రెండూ ఒకే ప్రాణవట్టంపై దర్శించుకోవడం విశిష్టత.
- మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల భక్తులు ఎక్కువగా ఇక్కడికి వస్తారు.
- 'కాళేశ్వరం' ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలు కూడవెల్లి వాగులోకి ప్రవహిస్తుండటంతో ఏడాది పొడవునా గుడి వద్ద జలకళ ఉట్టిపడుతోంది.
- ఆలయ ప్రాంగణంలో రాధారుక్మిణీ వేణుగోపాలుడు, దాసాంజనేయుడు, సంగమేశ్వరుడు, కుమారస్వామి, వీరభద్రుడు, పార్వతీమాత, గణపతి గుళ్లు దర్శనమిస్తాయి.
- గుడి పక్కనున్న కూడవెల్లి వాగులో పితృదేవతలకు పిండ ప్రదానాలు, అస్థికల నిమజ్జనం నిర్వహించుకోవచ్చు.
- శ్రావణం, కార్తికం, మాఘ మాసాల్లో .. ఇతర పండుగల రోజుల్లో జాతరలు, విశేష పూజలు జరుగుతాయి.

పురాతన ఇల్లు.. ప్రేమగా హంగులు



రంగు వేయడంతో ఆకట్టుకుంటున్న పెంకులు



ఇంటి లోపలి భాగం

పెద్దలు ఇచ్చిన ఆస్తిపాస్తులను యథాతథంగా దశాబ్దాలు గడిచినా కాపాడుకుంటూ వాడుకోవడం అరుదుగా చూస్తుంటాం. ఇళ్లు ఒక దశకు శిథిలావస్థకు చేరుతాయి. వాటికి కొద్దిపాటి మార్పులు, మరమ్మతులు చేస్తే అనేక ఏళ్లపాటు కుటుంబానికి అండగా ఉంటాయి. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం గుండారెడ్డిపల్లికి చెందిన భూంపల్లి సంజీవరెడ్డి.. తన ఏడు దశాబ్దాల చరిత్ర ఉన్న ఇంటిని కొద్దిపాటి అధునాతన మార్పులు చేసుకొని కాపాడుకుంటున్నారు. అందులో భార్యతో కలిసి నివసిస్తున్నారు. చిన్నపాటి గుత్తేదారుగా పనులు చేసుకుంటున్న సంజీవరెడ్డికి పురాతన ఇంటిపై అమితమైన ప్రేమ. పైకప్పు పెంకులకు కొత్తగా రంగులు వేశారు. లోపల బండలు మార్చారు. ఇంటిలోని మొగురాలు, దూలాలు మార్చకుండానే వాటికి ఆకర్షణీయమైన రంగులు వేశారు. ఇంటిని పూర్తిగా తొలగించకుండానే అధునాతనంగా ఆకర్షణీయంగా మార్చుకున్నారు. ఊరిలో తన ఇల్లు వైవిధ్యంగా కనిపిస్తుండటం సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. వారి పిల్లలు విదేశాల్లో ఉంటున్నారు.

- న్యూస్‌టుడే, కోహెడ గ్రామీణం

వాహనం అదుపుతప్పి కార్మికుడి దుర్మరణం

మునిపల్లి, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుదేరా శివారు జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో కంపెనీ కార్మికుడు దుర్మరణం చెందాడు. ఏఎస్సై ఏసయ్య తెలిపిన వివరాలు.. సదాశివపేట పట్టణానికి చెందిన పరిగి సాయికిరణ్ (29) ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. దిగ్వాల్ నుంచి సదాశివపేటకు బుధవారం ద్విచక్ర వాహనంపై వెళుతున్న క్రమంలో వాహనం అదుపు తప్పి పడిపోయాడు. తలకు బలమైన గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలోనే మృతి చెందాడు. భార్య వసంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

టేక్మాల్: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్సై రాజేశ్, స్థానిక ఆర్ఐ సాయిశ్రీకాంత్ తెలిపిన వివరాలు.. మహారాష్ట్ర ఉమర్గ గ్రామానికి చెందిన బాలాజీ కుమ్మర్ సుమారు 35 క్వింటళ్ల రేషన్ బియ్యాన్ని తన ఆటోలో తరలిస్తున్నాడు. హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న క్రమంలో బుధవారం బొడ్మట్‌పల్లి శివారులో పోలీసులకు బియ్యం పట్టుబడ్డాయి. వాహనాన్ని ఠాణాకు తరలించారు. పట్టుబడిన బియ్యాన్ని పాపన్నపేటలోని ఓ రైస్ మిల్‌కు తరలించి అక్కడే నిల్వ ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు టేక్మాల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	114–00	డ్రెస్డ్	197–00
రిటైల్	136–00	స్కిన్‌లెస్	224–00

అమ్మమ్మ, నాయనమ్మల కళ్లుగప్పి

ఆడ శిశువు అపహరణ

- సీసీ ఫుటేజీలో అనుమానితుల కదలికలు గుర్తింపు
- సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన



శిశువును తీసుకెళ్లినట్లు అనుమానిస్తున్న మహిళలు (సీసీ ఫుటేజీ)

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: భూమి మీద పడి ఒక్క రోజు కూడా కాకుండానే ఆ ఆడ శిశువు తల్లికి దూరమైంది. సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో అమ్మమ్మ, నాయనమ్మల పక్కన సేదతీరుతుండగా పట్టపగలు.. ఇద్దరు మహిళలు అపహరించుకు పోవడం కలకలం రేపింది. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం. . సంగారెడ్డి జిల్లా మనూరు మండలం దూదిగొండ గ్రామానికి చెందిన ఆటోడ్రైవరు అబ్బాస్ అలీ, నసీమా(25) దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ఒక మగ బిడ్డ గతంలో మరణించారు. ఐదో కాన్పు కోసం భర్తతో కలిసి మంగళవారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో నసీమా సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు సిజేరియన్ ద్వారా ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఆ శిశువును కింద పడుకోబెట్టి మనమడితో కలిసి అమ్మమ్మ మునీబీ, నాయనమ్మ హమీదాలు మధ్యాహ్నం ఆస్పత్రి కారిడార్‌లో కూర్చున్నారు. బురకాలు ధరించిన ఇద్దరు గుర్తు తెలియని మహిళలు వారి కళ్లుగప్పి శిశువును ఎత్తుకెళ్లారు. కొద్దిసేపటి తర్వాత శిశువు కన్పించకపోవడంతో అవాక్కయి ఆస్పత్రి పర్యవేక్షకుడు అనిల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే పట్టణ సీఐ భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి డీఎస్పీ, సీఐలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. ఆసుపత్రితో పాటు పట్టణంలోని ఇతర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను జల్లెడ పట్టారు. తొలుత ఇద్దరు గుర్తుతెలియని మహిళలు ఆసుపత్రి లోపలికి వచ్చి శిశువును అపహరించి, బయట వేచి ఉన్న మరో ఇద్దరు మహిళలకు ఇవ్వగా వారు ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లినట్లుగా గుర్తించారు. ఆటోలో ఇద్దరు.. స్కూటీపైన ఇద్దరు ఘటనా స్థలికి చేరుకున్నట్లు సీసీ ఫుటేజీల్లో నమోదైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు.

పది బృందాల ఏర్పాటు

ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా పోలీసులను అప్రమత్తం చేశారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. శిశువును గుర్తించేందుకు పది బృందాలను ఏర్పాటు చేశారు. కుమార్తె అపహరణకు గురైన విషయం తల్లికి తెలియనివ్వలేదు. తండ్రికి సమాచారం ఇవ్వగా బుధవారం రాత్రి ఆస్పత్రికి చేరుకొని బోరున విలపించాడు.

'మల్లన్న' సన్నిధిలో అదనపు కలెక్టర్


అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి దంపతులతో ఆలయ ప్రధానార్చకుడు మల్లికార్జున్ తదితరులు

చేర్యాల: కొమురవెల్లి మల్లికార్జునస్వామిని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో బుధవారం ఆలయానికి వచ్చిన ఆయన మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం ఆవరణలో ప్రతిష్ఠించిన దుర్గామాతను దర్శించుకున్నారు. ఆయన వెంట ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, స్థానాచారి పి.మల్లయ్య, అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

సీఎం సహాయనిధి.. పేదలకు వరం

కొండపాక గ్రామీణం, గజ్వేల్, జగదేవపూర్, ములుగు: కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో బుధవారం తహసీల్దార్లు దిలీప్‌నాయక్, మల్లికార్జున్‌రెడ్డి 202 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. గజ్వేల్‌లో 944 మందికి చెక్కులు అందజేసినట్లు ఆర్డీవో బన్సీలాల్ తెలిపారు. జగదేవపూర్‌లో 115 మందికి, ములుగులో 91 మందికి, మర్కుక్‌లో 44 మందికి చెక్కులు ఇచ్చినట్లు తహసీల్దార్లు తెలిపారు.

పూల తల్లి.. కరుణించు కల్పవల్లి

- సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు పూర్తి

న్యూస్‌టుడే, హుస్నాబాద్, దుబ్బాక, నంగునూరు:

తెలంగాణలో అత్యంత వైభవంగా జరుపుకొనే పండుగ బతుకమ్మ. తొమ్మిది రోజులపాటు మహిళలు తీరొక్క పూలను సేకరించి అత్యంత భక్తిశ్రద్ధలతో వేడుకలను నిర్వహిస్తారు. జిల్లాలో గురువారం జరిగే సద్దుల బతుకమ్మ ఉత్సవాలకు ప్రభుత్వం అవసరమైన నిధులు కేటాయించింది. నిమజ్జనం జరిపే ఘాట్లను అధికారులు పరిశీలించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఆయా ప్రాంతాల్లో జరిగే వేడుకల సన్నద్ధతపై కథనం..

35వేల మందికి వసతులు

హుస్నాబాద్ ఎల్లమ్మచెరువు కట్టపై జరిగే వేడుకలకు మహిళలతో కలిపి 35 వేల మంది హాజరవుతారని అధికారుల అంచనా. సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలకు పురపాలిక రూ.15లక్షలు కేటాయించింది. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉత్సవాలు జరగనున్నాయి. బతుకమ్మ ఏర్పాట్లను పురాధ్యక్షురాలు ఆకుల రజిత, కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ పర్యవేక్షించారు. కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నారు.


హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువుకట్ట వద్ద..

రంగులేసి.. ముస్తాబు చేసి..

నంగునూరుతో పాటు అన్ని గ్రామాల్లోనూ రోడ్లను శుభ్రం చేసి, వీధిదీపాలు ఏర్పాటు చేశారు. బతుకమ్మ ఆడే ప్రదేశాలు.. గుంతలు ఉన్నచోట మొరం పోయించినట్లు ఎంపీడీవో లక్ష్మప్ప తెలిపారు. నల్లపోచమ్మకు వెళ్లే మార్గంలో కానుకవాగులో బతుకమ్మలు నిమజ్జనం చేయడానికి గతంలో నిర్మించిన ఘాటుకు రంగులు వేసి అందంగా ముస్తాబు చేశారు.

దుబ్బాకలో..

దుబ్బాక పురపాలికలో వేడుకలకు ప్రభుత్వం రూ.15 లక్షలు కేటాయించింది. దుబ్బాక, లచ్చపేట, ధర్మాజీపేట, దుంపలపల్లి, చేర్వాపూర్, మల్లయ్యపల్లి, చెల్లాపూర్ వార్డుల్లోని చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లకు సంబంధించిన పనులు పూర్తయ్యాయి. పుర కమిషనర్ కె.రమేశ్‌కుమార్ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. చెరువుల వద్ద వ్యర్థాల తొలగింపుతో పాటు మెట్లకు ఆకర్షణీయంగా రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. దారుల వెంట వీధిదీపాలను అమర్చడమే కాకుండా నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంటారు. స్థానిక అంగడి బజారులో ఎల్‌ఈడీ దీపాలతో విశాలమైన వేదికను సిద్ధం చేస్తున్నారు. పట్టణంలో జరిగే నిమజ్జన వేడుకలకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు హాజరుకానున్నారని తెలిపారు.


పెద్దచెరువు మెట్లను పరిశీలిస్తున్న పురాధ్యక్షురాలు వనిత, కమిషనర్ రమేశ్‌కుమార్ తదితరులు

ప్రమాద నివారణకు 'సూచికలు'


దుంపలపల్లికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డు

రహదారులపై మలుపుల వద్ద సూచిక బోర్డులు లేక వాహనదారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. దుబ్బాక మండలంలోనూ పది ప్రమాదకర మలుపులను గుర్తించారు. గతేడాది వాటి వద్ద ప్రమాదాలకు గురై 10 మంది వాహనదారులు మృత్యువాత పడగా.. అనేకమంది తీవ్రంగా గాయపడ్డారు. సమస్యను గుర్తించిన దుబ్బాక పోలీసులు ఫ్లెక్సీతో కూడిన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఇప్పటికే 5 చోట్ల వాటిని ఏర్పాటు చేశారు. మిగతావి త్వరలోనే ఏర్పాటు చేస్తామని దుబ్బాక ఎస్సై వి.గంగరాజు తెలిపారు. వాహన తనిఖీలు చేపట్టే సమయంలో రహదారి భద్రతా నియమాలను పాటించాలని కోరుతూ వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, దుబ్బాక:

తాళ్లకుంటను సందర్శించిన ఐబీ అధికారులు


నీటిపారుదలశాఖ ఏఈకి వినతిపత్రం ఇస్తున్న స్థానిక రైతులు

చేర్యాల, న్యూస్‌టుడే: కబ్జాకు గురవుతున్న తాళ్లకుంటను కాపాడాలని కోరుతూ కొమురవెల్లి మండలం ఐనాపూర్ రైతుల ఆందోళనకు నీటిపారుదలశాఖ అధికారులు స్పందించారు. గ్రామ రైతులు, ప్రజలు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిని కలిసి విన్నవించగా, సమస్యను సదరు అధికారులకు ఫోన్ చేసి చెప్పారు. దీంతో ఐబీ ఏఈ శశిధర్‌రెడ్డి సిబ్బందితో బుధవారం తాళ్లకుంటను సందర్శించారు. స్థానిక రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. రెవెన్యూ అధికారులకు చెప్పి సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట స్థానిక మాజీ సర్పంచులు చెరుకు రమణారెడ్డి, మేరుగు శ్రీనివాస్, రైతులు మల్లం బాలయ్య, రమేశ్, ఆగంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు

జగదేవపూర్: మండల పరిధి ఇటిక్యాలలో ఆర్‌బీపీ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. మెడిసిటీ ఆస్పత్రి వైద్యులు రోగులను పరీక్షించి పలువురికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు, తాజా మాజీ సర్పంచి చంద్రశేఖర్ గుప్త, తదితరులు పాల్గొన్నారు.

దేవి రూపం.. దేదీప్యమానం


గజ్వేల్‌లో సంతోషిమాత

చేర్యాల, హుస్నాబాద్, హుస్నాబాద్ గ్రామీణం, గజ్వేల్ గ్రామీణ, కొండపాక గ్రామీణం, బెజ్జంకి, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లాలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బెజ్జంకిలో మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు. కుకునూరుపల్లి, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో జరిగిన పూజల్లో ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. చేర్యాల, హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో అమ్మవారికి పూజలు నిర్వహించారు.


సరస్వతీ దేవిగా విజయదుర్గ


తిమ్మారెడ్డిపల్లిలో వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు


గణేష్ నగర్‌లో సరస్వతి పూజలో విద్యార్థులు

స్తంభించిన ట్రాఫిక్.. రాకపోకలకు ఆటంకం

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రతరమవుతోంది. జాతీయ రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో అంబేడ్కర్, మల్లెచెట్టు చౌరస్తాల వద్ద ట్రాఫిక్ స్తంభించి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. దాదాపు వారం రోజులుగా ఇదే పరిస్థితి. తాజాగా బుధవారం మధ్యాహ్నం వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకుని వాహనాలను క్రమబద్ధీకరించారు. కూడళ్ల వద్ద పోలీసులను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వాహనదారులు క్రమపద్ధతిలో వెళ్లాని కోరారు.

తప్పుడు హామీలతో కాంగ్రెస్‌కు అధికారం: వంటేరు

జగదేవపూర్: ఎన్నికల ప్రచార సభల్లో తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అమలులో విఫలమైందని ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శివాజీ యువజన సంఘం ఏర్పాటు చేసిన శరన్నవరాత్రి పూజల్లో ఆయన బుధవారం పాల్గొని పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రుణమాఫీ పూర్తిచేయకపోగా, రైతు భరోసా ఊసే లేదన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మహిళలకు చేసిందేమీ లేదన్నారు. పది నెలల పాలనలో ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. ప్యాక్స్ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కవిత, భారాస మండలాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచి యాదవ రెడ్డి, నాయకులు పాల కమండల్ మాజీ డైరెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: రాష్ట్రంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలను వారి నియోజకవర్గానికి వెళ్లకుండా హౌస్ అరెస్టు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని దుబ్బాక భారాస కౌన్సిలర్లు ఆస యాదగిరి, ఇల్లెందుల శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం దుబ్బాకలో వారు మాట్లాడుతూ.. నియోజకవర్గానికి బయలుదేరిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

వన్‌టౌన్ సీఐగా వాసుదేవరావు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేట వన్‌టౌన్ సీఐగా శెట్టిపల్లి వాసుదేవరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ పోలీస్ శిక్షణ కళాశాలలో సీఐగా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను సిద్దిపేట వన్‌టౌన్‌కు బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సుప్రీంకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలి


ఎమ్మార్పీఎస్ నేతల నిరసన ర్యాలీ

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమల్లోకి తీసుకురావాలని మహాజన సోషలిస్టు పార్టీ సీనియర్ నాయకులు లింగంపల్లి శ్రీనివాస్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పెర్క పరశురాములు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత డీఎస్సీ నియామకాల్లో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో సిద్దిపేటలో బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏవో అబ్దుల్ రహమాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంద కృష్ణమాదిగను అరెస్టు చేయడం తగదన్నారు. సంఘం నాయకులు కృష్ణ, ప్రకాశ్, రమేశ్, మల్లేశం, ప్రశాంత్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

'గౌరవెల్లి'లో చేపపిల్లల విడుదల

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: అక్కన్నపేట మండలంలో నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టులో గౌరవెల్లి గ్రామ పరిధిలోని ఇప్పలపల్లి, పరికిబందం దకు చెందిన మత్స్య కార్మికులు చేపపిల్లలను వదిలారు. రూ.50వేలతో సొంతంగా కొనుగోలు చేసిన చేపపిల్లలను బుధవారం ఉదయం ప్రాజెక్టులో వదిలినట్లు ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు. ఇక నుంచి ప్రాజెక్టులో నంపూర్ వైపు చేపలు పట్టవద్దని, వలలు ఎవరూ వేయవద్దన్నారు. తమ అనుమతి లేకుండా ఎవరు చేపలు పట్టినా, వలలు వేసినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

గర్భిణులు, శిశుసంరక్షణపై శ్రద్ధ పెట్టండి

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: గర్భిణులు, శిశుసంరక్షణ సేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్యాధికారులు ఆనంద్, శ్రీనివాస్‌లు సిబ్బందికి సూచించారు. సిద్దిపేట గ్రామీణ మండలం చింతమడక, నారాయణరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం సందర్శించారు. ఈ మేరకు రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా పిల్లలకు వంద శాతం టీకాలు నిర్వహించాలని, అసంక్రమిత వ్యాధుల నివారణకు 30 ఏళ్లు పైబడిన ప్రజలందరికీ మందులు అందించాలన్నారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహిస్తే.. మలేరియా, డెంగీ వంటి వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని తెలిపారు. వైద్యులు బాపురెడ్డి, హిమబిందు తదితరులు ఉన్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) వ్యవస్థాపకుడు కాన్షీరామ్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీఎస్పీ నాయకులు కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బహుజనుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడు కాన్షీరాం అన్నారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, జిల్లా మాజీ అధ్యక్షుడు డేగల వెంకటేశ్వర్లు, తదితరులున్నారు.

హామీలు అమలయ్యే వరకు పోరాడుదాం: సీపీఎం

చేర్యాల: ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేవరకు ప్రజల పక్షాన సీపీఎం పార్టీ ఉద్యమాలు చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. కొమురవెల్లి మండలం ఐనాపూర్‌లో బుధవారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు ఆయన గ్రామ కూడలిలో పార్టీ జెండా ఎగురవేశారు.

గజ్వేల్: వంటిమామిడి మార్కెట్లో రైతుల పంటలకు మద్దతు కల్పించి ఆదుకోవాలని, హైదరాబాద్ నుంచి వచ్చే కూరగాయలను నియంత్రించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్లయ్య గజ్వేల్‌లో కోరారు.

నినదించి.. నిరసన తెలిపి


పట్టణంలోని జూనియర్ డాక్టర్ల ర్యాలీ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య జరిగి రెండు నెలలు గడుస్తున్నా అక్కడి ప్రభుత్వాలు బాధిత కుటుంబానికి ఇప్పటివరకు ఎలాంటి న్యాయం చేయలేదని సిద్దిపేట ప్రభుత్వ వైద్యకళాశాల జూనియర్ డాక్టర్లు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు భారతీయ వైద్యులకు సరైన గౌరవం, న్యాయం దక్కాలని నిరసిస్తూ కళాశాల వద్ద బుధవారం జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో జూడాలు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కళాశాల నుంచి ముస్తాబాద్ చౌరస్తా, మోడ్రన్ బస్టాండ్, బీజేఆర్ సర్కిల్ వరకు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు.

లక్ష్య సాధనలో ఆదర్శం


పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ దామోదర్

ములుగు, న్యూస్‌టుడే: యువత ముందే లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషిచేస్తే ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారని మర్కుక్ ఎస్‌ఐ దామోదర్ అన్నారు. బుధవారం మర్కుక్ మండలం ఎర్రవల్లిలో మర్కుక్ పోలీస్, ఎర్రవల్లి గ్రామ క్రీడా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. యువత తలుచుకుంటే అన్ని రంగాల్లో రాణించి సత్తా చాటుతారన్నారు. పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ బాలరాజు, క్రీడల నిర్వహణ సమన్వయకర్త కృష్ణ, వీడీసీ సమన్వయకర్త పరశురాం క్రీడాకారులు పాల్గొన్నారు.

యాచకురాలి నిజాయతీ.. అధికారుల అభినందన

సిద్దిపేట టౌన్: యాచకురాలైన ఓ వృద్ధురాలు తన నిజాయతీని చాటుకుంది. బస్టాండ్‌లో దొరికిన ఓ సంచిని ఆర్టీసీ అధికారులకు అప్పగించింది. సిద్దిపేట ఎక్స్‌ప్రెస్ బస్టాండ్ ఇన్‌ఛార్జి ఆకుల రాజేందర్‌పటేల్ తెలిపిన వివరాలు.. ప్రజ్ఞాపూర్‌కు చెందిన గట్టు యాదమ్మ గత సోమవారం తన కుమార్తె, మనవరాలితో కలిసి సిద్దిపేటకు వచ్చింది. తిరుగు ప్రయాణంలో ఎక్స్‌ప్రెస్ బస్టాండ్‌లో సంచి మరిచిపోయి బస్సులో ప్రజ్ఞాపూర్ వెళ్లిపోయింది. అక్కడే హోటల్‌లో పనిచేస్తున్న యాచకురాలు బాచవేణి లక్ష్మికి ఆ సంచి దొరికింది. తీసి చూసేసరికి అందులో రూ.2వేలు ఉన్నాయి. వెంటనే అక్కడే విధులు నిర్వహిస్తున్న బస్టాండ్ ఇన్‌ఛార్జి రాజేందర్‌కు అప్పగించింది. అతను సంచి పోగొట్టుకున్న బాధితురాలి ఆచూకీ తెలుసుకుని బుధవారం బస్టాండుకు పిలిపించి సదరు నగదును ఆమెకు అప్పగించారు. వృద్ధురాలు లక్ష్మిని ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరి, అధికారులు అభినందించారు.

ఆధునిక విధానాలతో అధిక దిగుబడి


పత్తి పైరును పరిశీలిస్తున్న శ్రీనాథ్

సిద్దిపేట అర్బన్: రైతులు ఆధునాతన పద్ధతుల్లో పంటలు సాగుచేసి అధిక దిగుబడులు సాధించాలని ఏవో శ్రీనాథ్ సూచించారు. సిద్దిపేట పట్టణపరిధి గాడిచర్లపల్లిలో బుధవారం పత్తి, వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నదాతలు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా తగు ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగాలన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు అభినందన

గజ్వేల్: డీఎస్సీ అభ్యర్థులను గజ్వేల్‌లో మార్కెట్ కమిటీ ఛైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ సర్దార్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు అభినందించారు. నియామక పత్రాలు అందుకునేందుకు వెళుతున్న వారిని గజ్వేల్ ఐవోసీ నుంచి ఆర్టీసీ బస్సులో పంపించారు.

చెరువుల వద్ద పటిష్ఠ చర్యలు: ఏసీపీ


నర్సాపూర్‌లో బల్దియా అధ్యక్షురాలు మంజులతో మాట్లాడుతున్న ఏసీపీ మధు తదితరులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: బతుకమ్మ పండుగ సందర్భంగా పట్టణంలోని చెరువుల వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఏసీపీ మధు బల్దియా అధికారులకు సూచించారు. విద్యుద్దీపాలు, తాగునీరు, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టం కచ్చితంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పండుగల నేపథ్యంలో కోమటిచెరువు, ఎర్రచెరువు, నర్సాపూర్, రంగధాంపల్లిలోని చెరువులను బుధవారం బల్దియా అధ్యక్షురాలు మంజుల, కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ద్వారా ప్రత్యేక పరిశీలన ఉంటుందన్నారు. దసరా పండుగ సందర్భంగా నర్సాపూర్, రంగధాంపల్లి, సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ చౌరస్తా వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. టూటౌన్ సీఐ ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి ఆవరణలో వృద్ధురాలి మృతి

గజ్వేల్ గ్రామీణ: అనారోగ్యంతో ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన గజ్వేల్ పట్టణంలో జరిగింది. సీఐ సైదా తెలిపిన వివరాలు.. రాయపోల్ మండలం ఎల్కంటికి చెందిన బుట్టోలా ఎంకవ్వ(65) ఈ నెల 4న ఆసుపత్రికి వెళ్తున్నానని చెప్పి గజ్వేల్‌కు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో స్పృహ తప్పి పడిపోయి ఉన్న వృద్ధురాలిని గుర్తించిన స్థానికులు వైద్యులకు తెలుపడంతో అక్కడికొచ్చిన వైద్యులు ఆమెను పరీక్షించి అప్పటికే మృతి చెందిందన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

15 బైకులు, 5 ఆటోలు స్వాధీనం

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్‌లోని రెండు పడక గదుల ఇళ్ల కాలనీలో పోలీసు బలగాలు కట్టడి ముట్టడి నిర్వహించారు. బుధవారం సాయంత్రం చేపట్టిన కార్యక్రమంలో డ్రగ్స్, గంజాయిని గుర్తించేందుకు నార్కోటిక్ డాగ్స్‌తో గాలింపు జరిపారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా ఏసీపీ వాసాల సతీశ్ ఆధ్వర్యంలో జరిపిన తనిఖీల్లో సీఐ కొంద్రు శ్రీనివాస్, మూడు నార్కోటిక్ డాగ్స్‌తో అనుమానాస్పద ప్రాంతాలను పరిశీలించారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని 5 ఆటోలు, 15 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ సతీశ్ మాట్లాడుతూ.. గంజాయి, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ ఎస్‌ఐలు తోట మహేశ్, విజయభాస్కర్, అభిలాష్‌తోపాటు ఏఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టరు పట్టివేత

కోహెడ గ్రామీణం: కోహెడ మండలంలోని తంగళ్లపల్లి మోయతుమ్మెద వాగు నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును రాణాకు తరలించినట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు. ఎలాంటి అనుమతి పత్రాలు చూపకపోవడంతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మద్యం తాగి పట్టుబడిన పలువురు వాహనదారులకు బుధవారం సిద్దిపేట జిల్లా ద్వితీయశ్రేణి జ్యుడీషియల్ న్యాయమూర్తి కాంతారావు జరిమానా విధించారు. కొన్ని రోజుల కిందట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం, నర్సాపూర్, రంగధాంపల్లి చౌరస్తాల వద్ద ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా నలుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. నిర్ధారణ పరీక్షల అనంతరం నివేదిక ఆధారంగా వారిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి వారికి మొత్తంగా రూ.7,500 జరిమానా విధించారు.